# అశ్వవాహనంపై మలయప్ప స్వామి



వేడుకగా శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు

రెండో రోజు స్వర్ణ పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు

తిరుమల, మేజర్‌న్యూస్:

మిగతా 5లో

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
ఆదివారం | 19 మే 2024 | పేజీలు 9

# అంతా కట్టుదిట్టం...

కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో ఐదంచెల భద్రతా ఏర్పాటు... జిల్లాలో 144 సెక్షన్ అమలు
సుమారు 96 సీసీ కెమెరాలతో ఈవీఎం స్ట్రాంగ్ రూం, పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా
ఈవీఎంలు భద్రత అంశంలో ఎలాంటి సందేహాలు, అపోహాలు అవసరం లేదు
- అత్యంత పారదర్శకంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
స్ట్రాంగ్ రూమ్ లను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించిన
కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత పోల్ అయిన ఈవిఎం, కంట్రోల్‌యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్‌లు భద్రపరచిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను, పరిసర ప్రాంతాలను శనివారం ఉదయం తిరుపతి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి, బ్యారికేడింగ్ తదితర అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు సలహాలు, ఆదేశాలు జారీచేశారు. సెక్యూరిటీ వద్ద సంబంధిత సందర్శకుల రిజిష్టర్ నందు కలెక్టర్ సంతకాలు చేశారు. కలెక్టర్ స్ట్రాంగ్ రూం పరిసర ప్రాంతాల్లో కలియ తిరిగి భద్రత ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు సూచించారు. బ్యారికేడింగ్ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటుతో, సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని, తగినంత సిబ్బందిని సంబంధిత రిటర్నింగ్

మిగతా 2లో

# వేడుకగా గంగమ్మకు....

# తిరుమల శ్రీవెంకన్న సారె





**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలుగా భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు వేడుకగా తిరుమల శ్రీవారి సారె శనివారం సమర్పించారు. గంగమ్మ జాతర ప్రారంభమైన నాలుగో రోజు శ్రీవారి నుంచి సారే సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు సారెను శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఆధ్వర్యంలో అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి లోకనాథం సారెను నెత్తిన పెట్టుకొని భక్త జన సందడితో, కళా ప్రదర్శనల కోలాహలంతో సారె ఊరేగింపు సాగించి సారెను గంగమ్మ ఆలయ ఈవో కె. మమతకు అందజేశారు. ఈవో శ్రీవారి సారెను శిరసుపై ఉంచుకొని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనల నడుమ సారె ఊరేగింపు చేపట్టారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలు, డప్పులు, తప్పెటగుళ్లు, కొమ్మకొయ్య, తీన్మార్, కీలు గుర్రాలు, గరగల్లు వంటి కళా ప్రదర్శనలతో కోలాహలంగా అమ్మవారి సారె సాగింది. అడుగడుగునా భక్తులు పసుపు నీరు చల్లుతూ హారతులు పట్టి కొబ్బరి కాయలు సమర్పించి సారెను మొక్కుకున్నారు. ఈ సాలె శోభాయాత్ర శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి

మిగతా 2లో

## శ్రీజ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి

# చిన్నకోటాయి ఉత్సవం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల చిన్నకోటాయి ఉత్సవం మూడవ రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం మూడో రోజు మొదట ఆలయంలో అలంకార మండపం నుంచి శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను దేవస్థానంలో పొగడ చెట్టు కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువు చేసి పలు రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకించి దీప దూప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు. అధికారులు. వేద పండితులు. శ్రీకాళహస్తి పట్టణం భక్తులు పాల్గొన్నారు.



## బాటిళ్లలో

# పెట్రోల్, డీజిల్ పోయవద్దు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ పెట్రోల్ బంకుల్లో కంటైనర్లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఆదేశించింది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్స్ లు రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపింది. ఈనెల 14న జరిగిన పోలింగ్ తర్వాత రాష్ట్రంతో పాటు అనేక ప్రాంతాలలో హింసాత్మక ఘర్షణలు జరుగుతూనే పద్యంలో ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు విధించినట్లు తెలుస్తుంది.



# అంతా కట్టుదిట్టం...

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు విధులు కేటాయించి పర్యవేక్షించాలని ఆదేశించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం వద్ద భద్రత ఏర్పాట్లు 11వ తేదీ నుండి 200 మీటర్లు నుండి రాష్ట్ర పోలీస్ బలగాలు, 100 మీటర్ల లో రాష్ట్ర సాయుధ బలగాలు, స్ట్రాంగ్ రూం వద్ద సిపీఎఫ్ ఏర్పాటు చేసి భద్రత ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. పోలింగ్ నాడు, మరుసటి దినం జరిగిన సంఘటనల నేపథ్యంలో ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేశామని, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎంట్రన్స్, రోడ్ పాయింట్ వద్ద నుండి సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే పంపుతున్నారని తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. 6 గార్డ్ పాయింట్‌లు స్ట్రాంగ్ రూం పరిధిలో ఏర్పాటు చేసి నిరంతర గస్తీ నిఘా ఉంటుందని తెలిపారు. సిపీఎఫ్, రాష్ట్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీస్‌లు కలిపి సుమారు 160 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. యూనివర్సిటీ కాంపౌండ్‌లో స్ట్రాంగ్ రూం వద్ద కట్టుదిట్టమైన 3 లేయర్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామని, తిరుపతి పార్లమెంటరీ, 7 అసెంబ్లీ నియోజక వర్గాల స్ట్రాంగ్ రూంలలో ఈవిఎంల భద్రతపై, అలాగే పరిసర ప్రాంతాల నిఘా కొరకు స్ట్రాంగ్ రూం పరిసరాల చుట్టూ నాలుగు దిక్కులా సుమారు 96 సీసీ కెమెరాల ఏర్పాటుతో స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ చేస్తున్నామని, ఎన్నికల పోటీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాటు చేశామని అన్నారు. ఈవిఎంలు, వివిప్యాట్‌ల భద్రత అంశంలో ఎలాంటి సందేహాలు, అపోహలు అవసరం లేదని అత్యంత పారదర్శకంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. నూతన ఎస్పీ విధుల్లో చేరాక సెక్షన్ 144 అమలు ఎన్ని రోజులు కొనసాగించాలి అని, ఇతర భద్రత అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని తగుచర్యలు తీసుకుని సురక్షిత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో పలు ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలపై అధనపు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ నేపద్యంలో రాజకీయ హింసాత్మక ఘటనలకు సంబంధించి ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా, సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యహరించాలన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఎలాంటి కల్పితాలు, ఫేక్‌న్యూస్ ప్రచారం జరగకుండా చూడాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారికి, జిల్లా ఎస్పీలను సంప్రదించి వివరణ తీసుకోవాలని కోరారు. అదే విధంగా జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుండి ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాలు ఆదేశాల మేరకు పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ శ్రీనివాస రావు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, చంద్రగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్ రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### మెడికల్ టెక్నాలజీ ఏవన్ ద్వారా

## రోగ నిరూపణ పెంచడంపై ప్యానల్ చర్చ

**చంద్రగిరి, మేజర్ న్యూస్ :** స్కూల్ ఆఫ్ పారామెడికల్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్, యంబియు విశ్వవిద్యాలయంలో రెండు రోజులు "అలైడ్ హెల్త్ కేర్ సాంకేతిక పురోగతి" అనే థీమ్ అనుబంధ ఆరోగ్య శాస్త్రాలపై 1వ అంతర్జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎం బి యు ఉపకులపతి ఆచార్య నాగరాజు రామారావు ముఖ్య వక్త డా. మాధవి, ఎపి చైర్పర్సన్, అలైడ్ అండ్ హెల్త్ కేర్ సైన్స్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ బాబు, సియంసి వేలూరు డా. సెల్వకుమార్ చీఫ్ బయోకెమిస్ట్,కావేరి బిల్రోత్ హాస్పిటల్, చెన్నై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.నాగరాజ్ రామారావు వైద్య వ్యవస్థలోని అనుబంధ ఆరోగ్య సంరక్షణ నిపుణులను హైలైట్ చేస్తూ, ప్రస్తుత వైద్య ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ1 ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. "మెడికల్ టెక్నాలజీలో ఎ ఐ ద్వారా రోగ నిరూపణను పెంచడం" అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది, ఆంధ్రప్రదేశ్లోని, వెలుపల ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొని సౌరేపై తమ పరిశోధన ప్రతిపాదనను సమర్పించారు. 'స్కూల్ ఆఫ్ పారామెడికల్ అలైడ్, హెల్త్ కేర్ సైన్సెస్, యంబియు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్లోని, వెలుపల ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొని సౌరేపై తమ పరిశోధన ప్రతిపాదనను సమర్పించారు. 'స్కూల్ ఆఫ్ పారామెడికల్ అలైడ్ , హెల్త్ కేర్ సైన్సెస్, యంబియు యొక్క డీన్, హెచ్ఒడి అండ్ ఆర్గనైజింగ్ కమిటీ ఛాన్సలర్, ప్రో ఛాన్సలర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ గ్రోత, స్ట్రాటజిక్ ఆఫీసర్, వైస్-ఛాన్సలర్ అండ్‌రిజిస్టర్ నుండి మార్గదర్శకత్వం, మద్దతుతో నిర్వహించారు. ఈవెంట్ను విజయవంతంగా నిర్వహించారు.







## తిరుమల శ్రీవెంకన్న సారె

(మొదటి పేజీ తరువాయి...)

కర్నాల వీధి, భేరి వీధి, కృష్ణాపురం ఠాణా, నాలుగు కాళ్ల మండపం, సద్దకాపు లేఔట్ ద్వారా గంగమ్మ ఆలయం వరకు సారె శోభాయాత్ర నిర్వహించారు. గంగమ్మ ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మకు సారెను సమర్పించి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు జేఈవోకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీగోవిందరాజస్వామి ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, పారుపత్తేదార్ ఉమామహేశ్వరరెడ్డి, ఇతర అధికారులు, గంగమ్మ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ముత్యపుపందిరి వాహనంపై గోవిందుడి కటాక్షం

**తిరుపతి రెవెన్యూ మేజర్‌న్యూస్ :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది.ముత్యపు పందిరి – సకల సౌభాగ్య సిద్ధి నిత్య అలంకార ప్రియుడైన శ్రీవారు పూటకొక అలంకారంలో దేదీప్యమానంగా వెలిగిపోతుంటారు. మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యపుపందిరిపై భక్తులను చల్లగా ఆశీర్వదిస్తారు. జ్యోతిషశాస్త్రం ముత్యాన్ని చంద్రునికి ప్రతీకగా చెబుతోంది. సముద్రం మనకు ప్రసాదించిన మేలివస్తువులలో ముత్యం ఒకటి. చల్లని ముత్యాల కింద నిలిచిన స్వామివారి దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుంది. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.





## చర్చిలో పోలీస్ తనిఖీలు బాధాకరం

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** పట్టణంలోని అరుంధతి పాలెం లో ఉన్న చర్చిలో పోలీసులు గంజాయి ఉందని అనుమానం పేరుతో పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామని గూడూరు పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభుదాస్ వెల్లడించారు . శనివారంగూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ సభ్యులు, టిడిపి క్రిస్టియన్ సెల్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభు దాస్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెం లో అనేక సంవత్సరాలుగా చర్చిని ఏర్పాటు చేసి ప్రార్ధనలు జరుగు తున్నాయని శుక్రవారం రోజు గంజాయి ఉందని అనుమానంతో పోలీసులు చర్చిని దౌర్జన్యంగా ఓపెన్ చేయించి తనిఖీలు చేయడాని ఖండిస్తున్నామని దీన్ని వ్యతిరేకిస్తూ చేపట్టబోయే నిరసన కార్యక్రమానికి అందరూ మద్దతు తెలియజేయాలని కోరారు ఈ సమావేశంలో ఇజ్రాయిల్ , అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణ మూర్తి



**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణ మూర్తి దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణ మూర్తి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నా శాయశక్తులు కూర్చి సేవ చేస్తానని స్పష్టం చేశారు. నిరంతరాయంగా ప్రజలకు సేవ చేసే శక్తిని నాకు కలిగించాలని కోరుకున్నట్లు తెలిపారు.

## ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

**కోట, మేజర్‌న్యూస్:** కోట పట్టణంలో వెలసియున్న ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి నీ పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అలంకరణతో విశేషంగా పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య మహిళలు కీర్తనల కార్యక్రమం నిర్వహించి.. కుంకుమ పూజ పుష్పాభిషేకం సుగంధ భరిత మల్లెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహా పంచామృతా భిషేకం, వాసవి హెూమం, మహా మంగళహారతి, అమ్మవారికి పుష్ప పల్లకి కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం వాసవి అమ్మవారు నెమలి పించం అలంకరణలో భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయ స్వామి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## మాజీ ఎంపీటీసీ హరికృష్ణ రెడ్డికి నివాళులు

**- కుటుంబ సభ్యులను ఓదార్చిన తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

**తిరుపతి, మేజర్‌న్యూస్:** పాకాల మండలం సామిరెడ్డి పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ హరికృష్ణ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం సామిరెడ్డి పల్లిలో నివాసం వద్ద ఆయన మృత దేహానికి చెవిరెడ్డి లక్ష్మీ, తనయుడు తుడా ఛైర్మెన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబ సభ్యు లను ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పార్టీకి సీనియర్ నాయకుడిగా హరికృష్ణ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హరికృష్ణ రెడ్డి పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.



## ధర్మరాజుల ఆలయంలో బకాసుర వధ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:**
కార్వేటినగరం మండలం కత్తిరి పల్లి పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్స వాల్లో భాగంగా శనివారం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం ఆలయం వద్ద హరికథా నిర్వ హించారు. రాత్రి బకాసురుడు బండిపై కుంభానికి వెళ్ళాడు. అనంతరం వీధి నాట కంలో బకాసుర వద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ ంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉభయ దాతలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 23 నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మండలంలో ఉన్న రైతులకు ఈనెల 23 నుంచి వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేయడం జరుగుతుంది. కావలసిన రైతులు తమ తమ పేర్లను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## విత్తన వేరుశనగ పంపిణీ

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలం లోని రైతులకు తెలియజేయడం ఏమనగా 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబందించి వేరుశనెగ విత్తనకాయలు సరఫరా చేయడం జరుగుతుంది.కావలసిన రైతులు మంగళవారం 21వతేదీన వారి రైతుభరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది.కావలసిన రైతులు తమభూమి పట్టాదారు పాసుపుస్తకాలు,ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో సహా వెళ్ళి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఈ ఏడాది వేరుశనెగ విత్తనాలు రెండు రకాల కాయలు పంపిణీ చేయడం జరుగుతుందని అందులో కే.6 రకం,టి.సి.జి.యస్ -1694 రకాలు ఉన్నాయని, 30కే.జి రాయితీ పోనూ, రూ.1710లు చెల్లించాలని, వేరుశనెగ క్వింటాళ్ళు పూర్తిధర రూ.9500 అని, రాయితీ 3800రూపాయలని,రైతు క్వింటాళ్ళకు 5700రూపాయలు చెల్లించాలని, వేరుశనెగ కాయలు తీసుకున్న ప్రతిరైతు తమ సమీపంలో ఆర్బికే సిబ్బందికి డిక్లరేషన్ ఇచ్చి వేరుశనెగ కాయలు తీసుకొని వెళ్ళాలని, రైతులు తప్పని సరిగా పొలంలో వేరుశనెగ పంట వేయాలని, లేనిచో ప్రభుత్వ రాయితీ రాదని చౌడేపల్లి వ్యవసాయ అధికారిణి తెలిపారు.

# గంగమ్మ ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**- అమ్మవారి ఆశీస్సులతో జగనన్న రెండో సారి సీఎం కావాలి**

**- వేడుక గంగమ్మకు మంత్రి రోజా సారె**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**
శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధి ల్లాలని మంత్రి ఆర్‌కే. రోజా తెలిపారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగం గా నాలుగో రోజు శనివారం రాష్ట్ర మంత్రి ఆర్కే.రోజా అమ్మవారికి సాంప్రదాయ సారె ను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సారెతో ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ ఈవో కె.మమతి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆర్కె.రోజా అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి గంగమ్మ ఆలయా నికి వస్తుంటానని, నేడు ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అమ్మవారి జాతర అత్యంత భాగా జరుగుతోందన్నారు. తిరుమల శ్రీవారి చెల్లెలుగా యావత్ భక్తజన పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి జాతర అందరం అత్యంత ఘనంగా జరుపుకుందా మన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న ప్పటి నుంచి అమ్మవారికి సాంప్రదాయ సారె సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టా నన్నారు. ఈ ఏడాది కూడా అమ్మవారికి సారె సమర్పించుని తన ఆడపడుచులందరూ శక్తి స్వరూపిణి గంగమ్మ తల్లి కృపాకటాక్షాలతో పసుపు కుంకుమలతో సుంఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలి పారు. తాను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి హెూదాలో ఉన్నప్పుడు తిరుపతి గంగమ్మ జాతర రాష్ట్ర పండుగగా ప్రకటిం చడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికల నేపథ్యంలో జూన్ 4వ వచ్చే ఫలితాలలో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావాలని, తాను నగరిలో మూడోసారి హాట్రిక్ విజయం సాధించాలని అమ్మవారిని కోరి ప్రార్థించిన ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్సీపీ సీనియర్ నేత ఆనందరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.





# శ్రీవారిని దర్శించుకున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

**తిరుమల, మేజర్‌న్యూస్:** అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నా రు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌తో మీడియా తో మాట్లాడుతూ చాలా రోజుల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు తమ డ్యూటీ చేస్తున్నారని బావిస్తున్నట్లు తెలిపారు. కొందరు పోలీస్ అధికారు లకు పాత వాసన అలానే ఉన్నట్లు ఉందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పార్టీ వైపు పోలీసులు వన్‌సైడ్ పనిచేశార న్నారు. ఎన్నికల్లో నిస్పక్షపాతంగా పోలీ సులు పనిచేయడం వల్ల వైసీపీ నాయ కుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతుందని స్పష్టం చేశారు. అక్రమాలు, అరాచకాలు చేయ లేక పోయామని వైసీపీ నాయకులు దీనస్థితిలో ఉన్నాం ని తెలియ జేశారు. ముఖ్యమంత్రికి కొన్ని బిల్లులు రావాల్సి ఉంది అందుకే ఐ-ప్యాక్ మీటింగ్‌లో మేమే వస్తామని అబద్ధా లు చెప్తున్నార న్నారు.



# సీఓసీ నిర్మాణపనులను వేగవంతం చేయండి

**మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పాత మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానం లో నూతనంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయా లని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శని వారం సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమీషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు, ఏఈ కామ్ ప్రతినిధులకు, ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ భవనం పూర్తి అయితే మునిసిపల్ కార్పొరేషన్‌కి నూతన కార్యాలయం రావడమే కాకుండా, కమాండ్ కంట్రోల్ సేవలు కూడా ప్రజలకి అందు బాటులోకి వస్తాయని, పనులు ఆలస్యంపై స్పందిస్తూ ఇకపై ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల వివరాలను తనకు తెలియజేస్తూ పూర్తి స్థాయిలో నివేదిక ఇస్తూ వుండాలని ఆదేశించారు. స్లాబ్ వర్కులన్ని పూర్తి చేసి, ఏ ఫ్లోర్‌కి ఆ ఫ్లోర్లలో చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలన్నారు. ఇకపై పనులు ఆలస్య మైతే తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్ర మంలో కాంట్రక్టర్లు, డిఈ విజయకుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి అనీల్ పాల్గొన్నారు.





# గంగజాతరలో భక్తుల సందడి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీతాతయ్యగుంట గంగజాతరలో భాగంగా నాలుగో రోజు శనివారం భక్తుల తాకిడితో గంగమ్మ ఆలయంలో సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు గంగ బొట్లు పెట్టుకొని, వేపాకు నడుముకు కట్టుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కొంద రు భక్తులు జానమెద వేషధారణలు, దేవతా మూర్తుల వేషాలతో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని పొంగళ్లు నైవేద్యాలు సమర్పించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వేలాది మంది అమ్మవారికి వేయి కళ్ల దుత్తల ప్రదక్షిణతో అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా సాంప్రదాయ బద్దంగా ఆలయం తరపున కైకాల కులస్థులు దొం వేషం, చాకలి కులస్థులు మంత్రి వేషం ధరించి నగరంలోని వీధులలో తిరుగుతూ ప్రతి ఇంట భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. జాతరలో భాగంగా ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని జాతర మొక్కులు తీర్చుకున్నారు.

**కైకాల కులస్థులు దొరవేషం, చాకలి కులస్థులు మంత్రి వేషం**

**ఇంటింటా పూజలు అందుకున్న దొరవేషదారులు**





**నేడు 'మాతంగి వేషం'...** శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఐదవ రోజు ఆదివారం తెల్లవారుజాము నుంచి మాతంగి వేషాన్ని గుడి తరఫున మీరాశిదార్లు, మొక్కుబడి ఉన్న స్థానికులు వేయడం ఆనవాయితీ. మిరాశీదార్లు వేసే మాతంగి వేషంలో కైకాల కులస్థుడొక్కరే పాల్గొంటారు. మాతంగి వేషాన్ని గంగమ్మ విశ్వరూపంగా భావిస్తారు. మాతంగి వేషదారి తన ఒడిబాలులో ఉండే అక్షింతలను వేపాకును అందరికీ పంచును. పెడుతూ తిరుపతిలో ఇంటింట పూజలు అందుకుంటారు. మొక్కుబడి భక్తులు మాతంగి వేషం ధరించి డప్పుల ధరువుల నడుమ చిందులు వేస్తూ వేషాలమ్మను, వివిధ గ్రామదేవతల్ని దర్శించుకొని తిరిగి గంగమ్మతల్లిని దర్శించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.





## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

**తిరుమల మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న సజ్జనార్ శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామివారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.ఆలయం వెలుపల తెలంగాణ ఆర్టీసీ ఎండి సీపీ సర్జనార్ మాట్లాడుతు.కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ., టిఎస్ఆర్టీసీ సభ్యులు., ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. గత రెండూరనర్రేళ్ల కాలంగా టిఎస్ఆర్టీసీ ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తూ వస్తుందని పేర్కొన్నారు. రోజుకి 55 లక్షల మంది ఆర్టీసీలో ప్రయాణం సాగిస్తున్నారని తెలిపారు. తక్కువ సమయంలో ప్రయాణికుల సంఖ్య పెరగటం ఆర్టీసీకి చాలా మేలు జరిగిందన్నారు. సిబ్బందిపై, ఆర్టీసీ ఆస్తులపై దాడి చేస్తే ఉపేక్షించే పరిస్థిది లేదని స్పష్టం చేశారు. మహా లక్ష్మి స్కీమ్ వల్ల ఆటో కార్మికులకు వచ్చిన ఇబ్బందులు పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

### వైద్య పరిశోధనలపై ఒప్పందం

# ఎంతో ఉపయోగకరం

### - ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్ రెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** వైద్య పరిశోధనలుపై చర్చ, ఒప్పందం చేయడం అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఎస్‌వి వైద్య కళాశాలలోని వివిధ విభాగాలతో పరిశోధనల కోసం ఎస్‌వి యూనివర్సిటీ విసి, ఎస్‌వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శనివారం వైద్య పరిశోధనలు, పరిశోధనలపై చర్చ, పరస్పర ఒప్పందాలపై మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఎస్‌వి వైద్య కళాశాల, ఎస్వీ విశ్వవిద్యాలయం పరస్పర ఒప్పందంతో ఇటు విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధనలో మెలుకువలు తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే విశ్వవిద్యాలయంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి క్లినికల్ నాన్ క్లినికల్, వైద్యులు, ఎస్వీ వైద్య కళాశాల రుయా ఆసుపత్రి నుండి పంపినట్లయితే విశ్వవిద్యాలయం క్యాంపస్ చదువుకుంటున్న విద్యార్థులకు, సిబ్బందికి, కోటర్స్ లో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యంతో ఆరోగ్యంగా అందించడానికి ఇలాంటి ఒప్పందాలు ఎంతైనా అవసరమని తెలిపారు. ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఎస్వీ విశ్వ విద్యాలయంతో మొట్టమొదటిసారిగా పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలాంటి పరస్పర ఒప్పందం వలన పరిశోధనలపై వైద్య విద్యార్థులకు, సోషల్ సైన్స్ విద్యార్థులకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులకు పరిశోధనలలో మెలకువలు, వాటికి కావలసిన ముఖ్య ఆవశ్యకతలను తెలుసుకొనుటకు పరస్పర ఒప్పందం ఎంతైనా అవసరమన్నారు. వివిధ విభాగలతో చర్చించి తదుపరి సమావేశంలో పరస్పర ఒప్పందం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ నారాయణ బాబు, ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్, డాక్టర్ వెంకటేశ్వర్లు (పరిపాలన), డాక్టర్ సునీత (అకాడమిక్), డాక్టర్ సత్యనారాయణ మూర్తి (పరిశోధనలు), డాక్టర్ శశికళ, (సామాజిక వైద్య విభాగం), ఎస్‌వి విశ్వవిద్యాలయం చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ టెక్నీషియన్ ముత్తువేలు, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.



# నవరత్నాల పేరుతో నయవంచన

### - రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటిల సురేంద్ర కుమార్

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమం అందిస్తానని రాష్ట్ర ప్రజలను నయవంచన చేశారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటల సురేంద్ర కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాలు పేరుతో ప్రతి నెల బటన్ నొక్కుతూ వారి ఖాతాలో నగదు జమ చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా లక్షలాది అర్హులైన వారిని సంక్షేమ పథకాలకు దూరం చేశారని, విద్యుత్ చార్జీలను దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం పెంచని విధంగా తొమ్మిది పర్యాయాలు విద్యుత్ చార్జీలను పెంచి బడుగు బలహీన వర్గాలు మధ్యతరగతి, వ్యాపార రంగాల పై ఆర్థిక భారం మోపారన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు 14,167 కోట్లను విలువ చేసే నిధులు ను వివిధ పథకాలకు బటన్ నొక్కుతూ ప్రజలను మభ్య పెట్టారు చివరికి అతికొద్ది నిధులు మాత్రమే లబ్ధిదారులు ఖాతాలో జమ చేశారన్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఎలక్షన్ మరుసటి రోజు నిధులు మంజూరు చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదు ఈ ప్రభుత్వానికి. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు వివిధ సంక్షేమ పథకాలకు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో నాలుగు వేల కోట్ల రూపాయలను విడుదల చేశారు. దాంట్లో భాగంగా ఆసరా పథకం పథకం కింద 1470 కోట్లు, విద్యా దీవన పథకం కింద 502 కోట్ల రూపాయలు మాత్రమే మంజూరు చేస్తారు,మిగిలిన రెండు వేల కోట్ల రూపాయలను తనకు కావలసిన గుత్తేదారులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. వైయస్సార్ చేయూత, ఈ బీసీ నేస్తం, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాది తోఫా, రైతులకు పెట్టుబడి నిధి లను అశ్రద్ధ చేశారు అన్నారు.తమకు సన్నిహితంగా ఉన్నవారి కోసం, తన ఎన్నికల కోసం సహకరించిన కాంట్రాక్టర్ల యొక్క బకాయిల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నాయకులు నిధులను విడుదల చేయడంలో తహ తహ లాడుతున్నారు. ఇంకా 12 వేల కోట్ల రూపాయలు పేద ప్రజలకు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.అందులో భాగంగా ప్రజలకు నిధులు విడుదల చేయడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు నిధులను విడుదల చేస్తూ ఆ ముసుగులో కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాం. బకాయిలను చెల్లించేటప్పుడు కూడా ఒక ఆనవాయితీ ఉంది ముందస్తు బిల్లును ముందు చేయాలి అయితే ఇవేమీ పట్టించుకోకుండా తనకు కావలసిన కాంట్రాక్టర్ల కోసం నిధులను మంజూరు చేస్తున్నారు. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో 83 కోట్ల రూపాయలు వివిధ శాఖల లో వివిధ కాంట్రాక్టర్లకు బకాయిలను చెల్లించవలసి ఉంది దానిలో భాగంగా ఐదు సంవత్సరాల క్రితం చేసిన కాంట్రాక్టర్లకు కూడా బిల్లు చెల్లించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాలకు వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అలాగే తన కోసం పనిచేసే కాంట్రాక్టర్లు యొక్క బిల్లులు ను చెల్లిస్తే మేము తీవ్రంగా కండిస్తున్నమన్నారు. జూన్ నాలుగవ తేదీ పైన కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటన్నిటి పైన సమీక్షించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటిల సురేంద్ర కుమార్

# విధులకు హాజరుకాని సిబ్బంది పై క్రమశిక్షణ చర్యలు

**- జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్**



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో గ్లోరియా

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** 2024 సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ విధులకు హాజరు కాని 228 మంది పిఒ, ఏపి ఓ,ఓపిఓలపై ఎన్నికల నియమ నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఎస్. షన్మోహన్ శనివారం ఒక తెలిపారు.

# కోడ్ అనంతరం అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

**- జడ్పీ సీఈవో గ్లోరియా**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలకు కూడా అనంతరం అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని జడ్పీ సిఈఓ గ్లోరియా తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సర్వసభ్య సమావేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి, ప్రజా ప్రతినిధులతో నిర్వహించామన్నారు. ప్రధానంగా తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపినట్లు జడ్పీ సీఈవో తెలిపారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో గ్లోరియా

# బోర్డు ఒకచోట.. కౌంటర్ మరోచోట...

## దేవస్థానం అధికారులు పనితీరుపై మండిపడుతున్న భక్తులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు చెప్పేదానికి చేసేదానికి ఎటువంటి పొంతన ఉండదు. పారదర్శకంగా ఉన్నట్లు పైకి చెబుతున్నా లోపల మాత్రం మరేదో దాగి ఉంటుంది. అందుకు 200 రూపాయల ప్రత్యేక దర్శనం కౌంటర్ ఉదాహరణ. ఓంకార స్వామి మఠం వద్ద పిఆర్ఓ కార్యాలయాన్ని, 200 రూపాయల ప్రత్యేక దర్శనం కౌంటర్ను దేవస్థానం అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. అయితే పిఆర్ఓ కార్యాలయాన్ని అక్కడే ఉంచి 200 రూపాయల టికెట్ కౌంటర్ ను మాత్రం ధూర్జటి గ్రంథాలయం వద్దకు మార్పు చేశారు. పిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన భక్తులు అక్కడే 200 రూపాయల టికెట్ కొనుగోలు చేసి ప్రత్యేక దర్శనానికి వెళ్లేవారు. ప్రముఖులైతే పిఆర్ఓ కార్యాలయ సిబ్బంది కూడా వెళ్లేవారు. టికెట్ కౌంటర్ ను ఎత్తివేయడంతో పిఆర్ఓ కార్యాలయం సిబ్బంది మాత్రమే భక్తులతో వెళుతున్నారు. టికెట్లు మాత్రం కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆలయానికి ఆదాయం రావడం లేదు. ఈ ఆదాయం కొందరు దళారుల జేబుల్లోకి వెళుతోంది. టికెట్ కౌంటర్ కూడా పిఆర్ఓ కార్యాలయంలోనే ఉంటే భక్తులు అక్కడే టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్లేవారు. దళారుల సంక్షేమం కోసం దేవస్థానం అధికారులు ఈ గొప్ప నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకుల్లాగా దేవస్థానం అధికారులు కూడా చెప్పేది ఒకటి చేసేది ఒకటి లాగా తయారయింది. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు భక్తులకు ఇన్ఫర్మేషన్ సెంటర్లో సక్రమంగా ఉండే విధంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.








వేదికపై మాట్లాడుతున్న టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, కళాకారుల నృత్య ప్రదర్శన

# కలల వికాసానికి జీవం సంగీత, నృత్యం

## టిటిడి మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** అన్నమయ్య జయంతోత్సవాలను పురస్కరించుకొని జైజవాన్, జైకిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కదిరి వెంకటరమణరావు ఆధ్వర్యంలో శనివారం మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య సంగీత.. నృత్యోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం ఆరంభమైన ఈ కార్యక్రమానికి టీటీడీ రిటైర్డ్ డెప్యూటీ ఈవో చిన్నంగారి రమణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలను ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది కళాకారులు పాల్గొని అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి హావ భావాలతో నృత్యాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీటీడీ బోర్డు మాజీ సభ్యు డు పోకల అశోక్ కుమార్, ప్రత్యేక అతిథిగా అన్నమయ్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, గౌరవ అతిధులుగా మబ్బు సూర్యనారాయణరెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోకల అశోక్ కుమార్ మాట్లాడుతూ కళాకారులను ఒక వేదికపైకి తీసుకొచ్చి కళాప్రదర్శనలతో వారిని ప్రోత్సహిస్తూ కళా వికాసానికి నిర్వాహకుడు వెంకటరమణరావు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. నృత్య వ్యాప్తికి గురువులు అందిస్తున్న కృషి ఎనలేని దని, మరింత మందిని నృత్య కళాకారులుగా తీర్చిదిద్దడంతో పాటు తద్వారా కళామతల్లి సేవకు గురువులు దోహదపడాలని ఆకాంక్షిం చారు. అన్నమయ్య వంశీయులు హరినారాయణాచార్యులు మాట్లా డుతూ 32 వేల సంకీర్తనలను రచించి శ్రీవారి సేవలో తరించిన భక్తుడు. అన్నమయ్య అని తెలిపారు. అన్నమయ్య భక్తి సంకీర్తనలకు నృత్యాన్ని మిళితం చేసి అన్నమయ్య సంగీత. నృత్యోత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం నిత్యం నృత్య కళా వికాసినికి కృషి చేస్తున్న 13 మంది నృత్య గురువులను అతిథులు, నిర్వాహకులు శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో లలితకుమారి, ఇరముని శేఖర్, కళాకారులు, గురువులు పాల్గొన్నారు.







# సమయపాలన లేని తహశీల్దార్ కార్యాలయం!

**- 11 దాటిన తెరుచుకోని కార్యాలయ తలుపులు**
**- తీవ్ర ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు రైతులు**
**- మీడియా ప్రతినిధులు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తని తహశీల్దార్**

**పెళ్లకూరు, మేజర్ న్యూస్:** పరిపాలన వ్యవస్థ సక్రమంగా నడవాలి అంటే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి. ఏ ప్రభుత్వానికైనా మంచి పేరు తీసుకొని రావాలి అంటే అధికారులు కృషి చేయాల్సిందే.కాని ఇక్కడ మాత్రం అధికారులు సమయపాలన పాటించక పోవడం వల్ల అర్జీదారులు రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన ఘటన మండలం లోని పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక కార్యాలయంలో ఉదయం 11 గంటలు దాటిన కార్యాలయంలో కేవలం రెవిన్యూ అధి కారి సంతోషి భాయ్, గ్రామ రెవిన్యూ అధి కారి వంశీ మాత్రమే విధుల్లో ఉన్నారు.దీంతో రెవిన్యూ అధికారుల కోసం పడిగాపులు కాసిన రైతులు అర్జీదారులు ప్రజలు రెవిన్యూ సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరుచూ సమయపాలన పాటించడం లేదని పలువురు వాపోతున్నారు. ఏదైన సమాచారం కోసం మీడియా ప్రతినిధులు తహసీల్దార్‌కి ఫోన్ కాల్ చేసిన ఫోన్ ఎత్తలేని పరిస్థితిలో తహసీల్దార్ కెవిఆర్వి ప్రసాద్‌రావు ఉన్నారు. గతంలో అధికారుల గురించి అర్జీ దారులు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారుల తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెల వేల రూపాయల్లో వేతనం తీసుకుంటున్న విధులు పట్ల నిర్లక్ష్యం ఏమిటని అర్జీదారులు రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని పుల్లూరు గ్రామ సచివాలయం నుండి లేబూరు మునిచంద్రయ్య ఫ్యామిలీ మెంబెర్ సర్టిఫికెట్ కోసం పుల్లూరు సచివాలయంలో ఫిబ్రవరి 26 2024 న అప్లికేషన్ నెంబర్ : 240226043396 తో దరఖాస్తు చేసుకున్నారు. కాని ఇప్పటికి తహసీల్దార్ వద్ద పెండింగ్ ఉండడంతో అర్జీదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి అర్జీదారులకు తగు న్యాయం చేయాలని ప్రజలు రైతులు కోరుతున్నారు.



## తులసి దళములతో లక్ష్మీ నరసింహస్వామికి అలంకరణ


లక్ష్మీ నరసింహ స్వామికి అలంకరణ

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చవట గుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి శనివారం తులసీదళములతో అలంకరించి పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయ దారులు కోదండ రెడ్డి అభిషేక పూజలు చేశారు. ధర్మకర్త మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లు ను పర్యవేక్షించారు.

## నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయండి



**కార్వేటీనగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న పాఠశాలలో నాడు నేడు కింద మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారు విజయ్ కుమార్ మనోజ్ కుమార్ తెలిపారు. మండల విద్యాశాఖధికారి కార్యాలయం నందు ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు నాడు నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక క్షేమం కోసం వరుణ హోమం



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** సకాలంలో వర్షాలు పడి ప్రజలందరూ పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షతో ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి శనివారం రామచంద్రాపురం మండలం సూరావారి పల్లె గ్రామంలో ఉన్న సురభి గో సంరక్షణ శాలలో భక్తులతో కలిసి వరుణ హోమం చేశారు. అనంతరం శివలింగానికి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం శివ నామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ వరుణ హోమం చేయడం వల్ల సకాలంలో వర్షాలు సమృద్ధిగా పడి పాడి పంటలతో ఈ దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షతో ఈ హోమం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ఈ హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## ఘనంగా వాసవీ మాత జయంతి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం వాసవీమాత జయంతి సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు శ్రీ వాసవీ మహా హోమం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఉయ్యాల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పలమనేరు పట్టణంలోని ఆర్యవైశ్యులు, తదితర భక్తులు పాల్గొని అమ్మవారి దీవెనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

**గంగమ్మ గుడివద్ద అన్నదానం:**



పట్టణంలోనే వేణుగోపాల స్వామిగుడి వద్ద నుండి భక్తిశ్రద్ధలతో గాండ్ల సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ తిరుపతి గంగమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం మారెమ్మ గుడిలో పొంగళ్ళు ఏర్పాటు చేసి స్వామికి నైవేద్యం అందించారు. అనంతరం గాండ్ల సేవా సంఘం సభ్యులు పురవీధుల గుండా ర్యాలీగా గుడి వద్దకు చేరుకున్నారు. అనం తరం అక్కడ ఏర్పాటు చేసిన గాండ్ల సేవా సంఘం సభ్యులు ప్రజలకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుట్టి,కేశవ,మురళీకృష్ణ, షన్ముగం, సర్వనా, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# మాపై దాడి చేస్తేనే ....మా వాళ్లు ప్రతి దాడి చేశారు

**- రామచంద్రాపురం జడ్పీటీసీ ఢిల్లీ రాణి...**



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** నామినేషన్లు వేస్తున్న సమయంలో చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి వాహనాన్ని అడ్డు కొని రాళ్లు రావడం మొదలుగా టిడిపి కార్యకర్తలు దాడులు చేశారని అలాగే రూరల్ ఇతర ప్రాంతాలలో టిడిపి వర్గీయులు వైకాపా నాయకులపై కార్యకర్తలపై దాడులు చేయడంతోనే పద్మావతి యూనివర్సిటీ దగ్గర మా వాళ్ళు ప్రతి దాడి చేశారని, పులివర్తి నాని వాహనాలపై ప్రతిదాడి చేశారేగాని ఏ ఒక్కరిపై హత్యాయత్నానికి పాల్పడలేదని రామచంద్రపురం జడ్పిటిసి ఢిల్లీ రాణి తెలిపారు. శనివారం తిరుపతి రూరల్ చంద్రగిరి హైవే మార్గంలోని ఓ ప్రైవేట్ హోటల్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మహిళలు మాట్లాడుతూ పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎం లు ఏర్పాటుచేసిన చోట ఇటీవల జరిగిన పులివర్తి నాని పై దాడి, వాహనాల ధ్వంసం ఘటనలో తమ వారు ఐదుగురు మాత్రమే వాహనాలను ధ్వంసం చేయడానికి వెళ్లారే గాని.. ఎవ్వరిని చంపడానికి వెళ్లలేదని స్పష్టం చేశారు. చంద్రగిరి మండలం కుచేవారిపల్లిలో, రామచంద్రాపురం మండలంలో టిడిపి వర్గీయులు మా వైకాపా కార్యకర్తలపై దాడి చేసి ఇంటికి నిప్పంటించి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి అయిన మోహిత్ రెడ్డి కారును నిప్పు పెట్టి మా కార్యకర్తలపై దాడి చేశారని ఆ ఘర్షణలు వెలుగులోనికి రానీయకుండా చేశారని ఆరోపించారు. టిడిపి వర్గీయులు కత్తులు తదితర ఆయుధాలతో ఉండడంతో. అలాంటిది మా వాళ్లు కారులను ధ్వంసం చేయడానికే సమ్మెటిని ఎత్తుకెళ్లారని, దీనిని వక్రీకరించి టిడిపి వారు తమ పిల్లలపై ఆరోపించడం తగదన్నారు. దీనిపై తాము ఎంతవరకైనా వెళ్తామన్నారు. రెడ్డి సామాజిక వర్గం అంటేనే తమపై దాడులు చేస్తూ, కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసుపై గ్రామాలలో విచారిస్తే పూర్తి విషయాలు అధికారులకే అర్థమవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రజిని, సుకన్య, లతా, తదితరులు పాల్గొన్నారు.

# పులివర్తి నాని ఆరోగ్యం కోసం మృత్యుంజయ హోమం


శ్రీ మిట్ట మీద గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పులివర్తి సుధా రెడ్డి

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం మెరుగుపడాలని ఆయన సతీమణి మృత్యుంజయ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం చంద్రగిరి పట్టణంలోని శ్రీ మిట్ట మీద గంగమ్మ ఆలయంలో పార్టీ నేతలతో కలిసి మృత్యుంజయ హోమం నిర్వహించారు. 4 రోజులు క్రితం తిరుపతి మహిళా యూనివర్సిటీలో పులివర్తి నానిపై వైసీపీ మూకలు హత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన భుజానికి, కాలుకి గాయమైంది. మెరుగైన వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులు బయట ప్రాంతానికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి ఆయన ఆరోగ్యం కోసం గణపతి పూజ, నవగ్రహ పూజ, మృత్యుంజయ హోమం చేపట్టారు. హోమం తర్వాత అమ్మవారి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# ఓటర్లుకు ధన్యవాదాలు తెలిపిన ఇంచార్జ్ ఎంపీడీవో



**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన ఓటర్లకు, పంచాయతీ సెక్రెటరీలకు, బి ఎల్ వో లు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందని, ఇంటి పన్ను వసు లపై సమీక్ష, గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి నెలకొంటే ముందస్తుగా ఎటువంటి చర్యలు సిద్ధం చేసి ఉన్నారో వాటిపై కార్యాచరణ, వసూలు చేసిన ఇంటి పన్ను లో లైబ్రరీ పన్నును జిల్లా గ్రంధాలయ సంస్థకు వెంటనే చెల్లించాలని, గ్రామాలలో సాధారణ టీకాలు వేయడం పై సమీక్ష, ప్రతి కార్యదర్శి తప్పనిసరిగా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సమావేశాలకు నిర్దేశించిన సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఇన్చార్జ్ ఎంపీడీవో కార్యదర్శులకు సూచించారు.

## అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



**మంగళం, మేజర్ న్యూస్:** తిరుపతి అర్బన్ పరిధిలోని శెట్టిపల్లి చెరువులో అక్రమ నిర్మాణ పనులను శనివారం రెవిన్యూ అధికారులు అడ్డుకున్నారు. శెట్టిపల్లి గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 119 లో తిరుపతికి చెందిన కొందరు చెరువు భూమిలో జెసిబితో చదును చేసి రేకుల షెడ్ నిర్మాణం చేపట్టడానికి పునాదిరాళ్లను పేర్చుతుండగా వీఆర్వో భూపతి అడ్డుకుని చెరువుకు సంబంధించిన భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్రమ నిర్మాణదారులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

## బోనుపల్లి సంఘమిత్ర తొలగింపు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని బోనుపల్లి సంఘమిత్ర జి వేణు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓ పార్టీకి ఓటు వేయాలని నగదు పంపిణీ చేశారు. సంఘమిత్రపై ఆశాఖ ఉన్నత అధికారులు వేటు వేశారు. వివరాలను పరిశీలిస్తే. మండలంలో బోనుపల్లి సంఘమిత్రగా పనిచేస్తున్న వేణు ఎన్నికల్లో నగదు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు పత్రికల్లో కథనాలు వెలవడంతో ఎంసిసి నిబంధనల ప్రకారం సంఘమిత్ర వేణును మండల సమైక్య నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్చార్జి పిడి ప్రభావతి తెలియజేశారు. తొట్టంబేడు మండల ఏపీఎం వివరణ కోరగా. సంఘమిత్ర వేణును మండల సమైక్య నుంచి తొలగించడం జరిగిందని, ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే గ్రామ సమైక్య నుంచి కూడా తొలగించబడుతుందని గ్రామ సమైక్యాలో రికార్డులు కూడా స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

## యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించనున్నట్లు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. 475 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మరియు వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో పదవ తరగతి లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందచేస్తామన్నారు. ఈనెల 26వ తేదీన నెల్లూరు నగరంలోని అపోలో ఆసుపత్రి ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు యాదవ ఎంప్లాయిర్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని మయూరి శ్యామ్ యాదవ్(బండి శ్యామ్ సుందరరావు) తెలియచేశారు. పదవ తరగతి యాదవ విద్యార్థులు వారి మార్కులిస్టు ను 9948606664, 9705800794 నెంబర్లకు వాట్సప్ చేసి నమోదు చేసుకోవలని తెలిపారు. ఈ అవకాశాన్ని యాదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఈ నెల 26వ తేదీన ఉదయం 8 గంటలకు జరిగే ఈ ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.



## చలో వెంకటగిరి వాయిదా...



**వెంకటగిరి మేజర్‌న్యూస్ :** వెంకటగిరి క్రాస్ రోడ్లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కారణంగా వెంకటగిరిలోని దళిత సంఘాలన్నీ కలిసి దళిత బహుజన ఆత్మగౌరవ పోరాట వేదికగా ఏర్పడ్డాయి. అంబేద్కర్ విగ్రహం ధ్వంసానికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని గత నాలుగు రోజులుగా దళిత బహుజన ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో దళిత సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. దుండగుల దాడిలో ధ్వంసం అయిన అంబేద్కర్ విగ్రహం స్థలంలో ప్రభుత్వమే నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఇదే క్రమంలో ఈ నెల 20వ తేదీ సోమవారం రోజు చలో వెంకటగిరి కార్యక్రమం పిలుపునివ్వడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా గూడూరు అర్డిఓ ,డిఎస్పీ లు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కచ్చితంగా పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. అలాగే ధ్వంసం అయిన అంబేద్కర్ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. %=ఒశీ, ఒంజూ% లు దళిత సంఘాలతో చర్చించిన తర్వాత ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా చలో వెంకటగిరి కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చలో వెంకటగిరి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు దళిత సంఘాలు తెలిపాయి.

## రోడ్డు ప్రమాదంలో ఓ యువకుని మృతి



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద కారులో వెళ్తూ ముందు వెళ్తున్న ట్రక్కును ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడకక్కడే మృతి చెందాడు. వివరాలకెళితే ఇలా వున్నాయి.రేణిగుంట మండలం ఆర్ మల్లవరంకు చెందిన బాలసుబ్రమణ్యం కుమారుడు సందీప్ (31) బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు.పెండ్లి చూపులు వున్నయని తల్లిదండ్నులు చెప్పడంతో బెంగళూరు నుంచి కారులో స్వగ్రమానికి బయలు దేరి వచ్చుడు.ఐతేపల్లి వద్ద వేగంగా వేళుతూ ముందు వెళుతున్న టక్కను వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గతంలో అమెరికాలో వుండి వివాహం కోసమే స్వదేశంకు వచ్చినట్లు సమాచారం. చంద్రగిరి యసై అనితా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని చెంబడి పాలెం వద్ద నాయుడుపేట పూతలపట్టు 71వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై కే శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని చెంబడిపాలెం నాయుడుపేట పుతలపట్టు 71 వ జాతియ రహదారి వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని నాయుడుపేట నుండి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు ఢీకొని పరారైంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై నడుచుకుంటున్న వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడు అలిశెయార్ గా నెల్లూరు వాసిగా గుర్తించిచారు.దీంతో స్థానిక ఎస్సై కే శ్రీకాంత్ పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# వైకాపా నాయకుల దాడులు పిరికిపందల చర్య

### - తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి



సపమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి వారి గురవా రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఈనెల 13వ తేదీ పోలింగ్ రోజు నుంచి వైకాపా నాయకులు శ్రీకాళహస్తి, తిరుపతి, మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గలలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ. బిజెపి నాయకులపై పోలింగ్ ఏజెంట్లపై దాడులు చేయడం పిరికిపందల చర్య అని తెలుగు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. గురువారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ మాచర్లలో పిన్నెపల్లి సోదరులు ఒక ఏజెంటు కుటుంబాన్ని కొట్టి గాయపరిచి వీడియో కాల్ ద్వారా బూత్‌లో ఉన్న ఏజెంటును చూపెట్టి బెదిరించడం అప్పటికీ బయట రాకపోవడంతో శాసనసభ్యుడుగా ఉన్నట్టు వంటి వ్యక్తి చొక్కాబట్టి బయటికి లాగడం లాంటి ఘటనలు ప్రజాస్వామ్యంలో మంచిది కాదని ముక్తకంఠంతో ఖండించారు. రాష్ట్రంలో వైసీపీ నాయకుల అరాచకలు పరాకాష్టకు చేరిందని, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 13వ తారీకు పోలింగ్ సందర్భంగా రేణిగుంట మండలం మల్లవరం పోలింగ్ బూత్ నందు బీసీ వర్గానికి చెందిన చిన్నారెడ్డి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం ఏర్పేడు మనం దుగ్గ పేరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వారిపై దాడులు చేయడం తెలుగుదేశం బిజెపి కార్యకర్తల మీద దాడులకు పూనుకోవడం నీ తీవ్రంగా తెలుగుదేశం పార్టీ తరపున ఖండిస్తున్నాం. ఇక్కడ శాసనసభ్యుడుగా ఉన్నటువంటి వ్యక్తి ఐదు సంవత్సరాల ముందు ఒకటిన్నర కోట్లు ఆస్తి ఉన్నట్లు ఎన్నికల అపవిట్లో పొందుపరిచి ఈరోజు ప్రజాధనం డ్యూటీ చేసి 100 కోట్లు పైచిలుకు ఓటర్లను పెట్టడానికి ఖర్చు చేయడం వారి అవినీతి పరాకాష్టకు నిదర్శనం కాదా సూటిగా శాసనసభ్యున్ని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తు న్నాం. ఎంత డబ్బు ఖర్చు చేసినా ఈ రాష్ట్రం తర్వాత ముఖాభివృద్ధి సాధించాలని లక్ష్యముతో అన్ని వర్గాల ప్రజానీకం చంద్రబాబు నాయుడుని మే 13వ తేదీన జరిగిన పోలింగ్ నందు రాష్ట్రంలోని యువ ఓటర్లు, ఉద్యోగస్తులు, ప్రజ లు ఉమ్మడి తెలుగుదేశం అభ్యర్థులను ఆశీర్వదిస్తున్నారన్నారు. తిరుపతిలో స్ట్రాంగ్ రూముల పరిశీలనకు వెళ్లిన చంద్రగిరి ఉమ్మడి తెలుగుదేశం అభ్యర్థి నానిపై 150 మంది వైసిపి అల్లరి మూకలు కత్తులు రాడ్లుతో హత్యాయత్నం చేయడానికి పూనుకోవడం నానిని గన్ మాన్‌ని గాయపరచడం మరి అవి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. అక్కడజరిగిన సంఘటనపై స్థానిక ఆర్డిఓ విచారణ జరిపి జరిగిన సంఘటనపై యదార్థాలను పొందుపరచకుండా ప్రభుత్వానికి వైసీపీ నాయకులకు అనుకూలంగా నివేదిక ఇవ్వడం ఆ నివేదికను జిల్లా కలెక్టర్ సరిదిద్దకుండా తప్పుడు నివేదిక ఎలక్షన్ కమిషన్ కందించడానికి తీవ్రంగా తప్పు పట్టారు. ఇటువంటి కలెక్టర్ పర్యవేక్షణలో రేపు ఎన్నికల కౌంటింగ్ సక్రమంగా జరిపే అవకాశాలు లేవు. అదేవిధంగా స్థానిక వైసిపి నాయకులు అడుగుజాడల్లో వారు నడుచుకోవడాన్ని వివరంగా ఖండిస్తూ ఈ కలెక్టర్ పర్యవేక్షణలో కౌంటింగ్ కేంద్రాల వద్ద న్యాయం జరగదని తెలియపరుస్తూ అధికార పార్టీతో పట్టాసు పలికిన కలెక్టర్లు బదిలీ చేసి పారదర్శకంగా ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే విధంగా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ తక్షణం నిర్ణయం తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ తరపున ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నాం. ఈ సంఘటనలకు బాధ్యులైన పోలీస్ అధికారులను, సస్పెండ్ చేయాలని వారు ఎలక్షన్ కమిషన్, అధికారులను కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి, తో పాటు తెలుగుదేశం పార్ట రూరల్ మండల పార్టీ అధ్యక్షులు కామేష్ యాదవ్. రాష్ట్ర వన్నిరెడ్డి సాధికార కమిటీ సభ్యులు మిన్నల్ రవి. పార్లమెంట్ బీసీ ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రహ్మణ్యం. పార్లమెంట్ బీసీ కార్యవర్గ కార్యదర్శి ఎం ఎస్ రెడ్డి. పార్టీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు. పార్లమెంట్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కేకే రమణ. నియోజకవర్గ బీసీ అధ్యక్షులు దొరయిరాజు రెడ్డి. పార్టీ నాయకులు నవీన్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** పట్టణం లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో ఘనంగా వాసవి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాసవి అమ్మవారిని గురించి తెలియజేస్తూ తెలుగు రాష్ట్రాల్లోని హిందువులకు మరీ ముఖ్యంగా ఆర్యవైశ్యులకు 'శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి' అంటే ఎంతటి భక్తో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. వారి కులదైవం అయిన ఈ తల్లిని తలచుకోనిదే వారి జీవితం గడవదు. అలాంటి వాసవి జయంతి వైశాఖ శుద్ధదశమి నాడు, అంటే ఈ నెల 18 న వస్తోంది. ఇంతకీ ఎవరీ కన్యకాపరమేశ్వరి. ఈసారి వచ్చే వాసవి జయంతి ప్రత్యేకత ఏమిటి తెలుసుకుందాం రండి! సాక్షాత్తు ఆ పరమేశ్వరి అవతారమైన వాసవీదేవ కథ వెయ్యేండ్ల నాటిది. అప్పట్లో 'కుసుమ శ్రేష్టి' అనే నాయకుడు పెనుగొండ రాజధానిగా అక్కడి వైశ్యులకు రాజుగా పరిపాలిస్తున్నాడు. తన భార్య పేరు కుసుమాంబ. ఆ దంపతులకు ఎన్నేళ్లు గడిచినా సంతాన భాగ్యం లేకపోయింది. దాంతో తన గురువు భాస్కరాచార్యుల సలహా మేరకు%ొ% పుత్ర కామేష్టి యాగాన్ని చేశారు. యాగ ఫలితమో మరేమో కానీ ఆ దంపతులకు వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారం నాడు ఒక బాబు, ఒక పాప%ొ% కవల పిల్లలుగా జన్మించారు.కుసుమ శ్రేష్టి తన కుమారుడికి విరూపాక్షుడనీ, కుమార్తెకు వాసవాంబ అని పేరు పెట్టారు. రోజులు గడిచేకొద్దీ ఇద్దరూ అద్భుతమైన వ్యక్తిత్వాన్ని అందుకున్నారు. కొడుకు యుద్ధవిద్యలలో ఆరితేరి రాజ్యభారాన్ని మోసేందుకు సిద్ధమయ్యాడు. వాసవాంబ సంగీతం, తర్క శాస్త్రాల్లో ఆరితేరి యువతులందరికీ ఆదర్శంగా నిలిచింది. పెనుగొండ అప్పట్లో వేంగి రాజ్యంలో భాగంగా ఉండేది. విష్ణువర్ధనుడు ఆ దేశాన్ని పాలిస్తూ ఉండేవాడు. ఓ రోజు విష్ణువర్ధనుడు తన రాజ్యాన్ని పర్యటిస్తూ పెనుగొండకు చేరుకున్నాడు. అక్కడ కుసుమ శ్రేష్టి పక్కనే ఉన్న వాసవిని చూసి మనసు పారేసుకున్నాడు. కొన్నాళ్లకి ఆమెను చేసుకుంటానంటూ కుసుమశ్రేష్టికి వర్తమానం పంపాడు.ఈ సంబంధం కుసుమ శ్రేష్టి కుటుంబానికి ఏమాత్రం ఇష్టం లేదు. అప్పటికే వివాహమై, వయసులో చాలా పెద్దవాడైన విష్ణువర్ధనుడికి అందాలరాశి, సకలగుణ శీలి అయిన వాసవాంబను ఇచ్చి కట్టబెట్టాలన్న ఆలోచన వారికి సుతరమూ నచ్చలేదు. ఈ తిరస్కారం గురించి విన్న విష్ణువర్ధనుడు మండిపడ్డాడు. ఎా ు ఎా ం బ న ం బలవంతంగా తీసుకురమ్మంటూ తన సైన్యాన్ని పంపాడు. వారిని అడ్డుకునేందుకు పెనుగొండ చుట్టుపక్కల ఉండే 714 గోత్రాల ఆర్యవైశ్యులు సమావేశమయ్యారు. వారిలో కొందరు ఆత్మగౌరవం కోసం చివరి శ్వాస వరకూ విష్ణువర్ధనుడికి వ్యతిరేకంగా పోరాడాలని నిశ్చయిం చుకోగా, మరికొందరు ఆమెను అప్పగిస్తే ఏ సమస్య ఉండదనే అభిప్రాయంతో ఉన్నారు.ఈ వాదనలన్నీ విన్న వాసవిదేవి, తన కోసం ఎలాంటి రక్త తర్పణం జరగడానికి ఇష్టపడలేదు. అందుకు బదులుగా, తనకు అనుకూలంగా ఉన్న కొద్దిమందితో కలిసి హెూమగుండంలో ఆత్మబలిదానానికి సిద్ధపడింది. ఆ బలిదానం కోసం హాజరైనవారందరి ముందూ తన అవతార రహస్యాన్ని తెలిసి, నిజరూపాన్ని చూపింది. వాసవి బలిదానం గురించి వినగానే విష్ణువర్ధనుడు రక్తం కక్కుకుని మరణించాడు. నాటి ప్రజలందరూ వాసవి దేవి మహత్యాన్ని గ్రహించి ఆమెను కొలుచుకుంటూ, విలువలతో జీవిస్తూ కాలం గడిపారు. వాసవిదేవి సోదరుడు విరూపాక్షుడు పెనుగొండను గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాడు. అహింసకు కట్టుబడినందుకు, స్త్రీల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టినందుకు, విలువల కోసం ప్రపంచ సుఖాలను వదులుకున్నందుకు వాసవిదేవి గొప్ప పుణ్యమూర్తిగా, వైశ్యులకు పూజ్యురాలిగా నిలిచిపోయింది. అమ్మవారికి శుక్రవారం అంటే ఎంత ఇష్టమో తెలియనిది కాదు. అందునా వాసవిదేవి అవతరించింది కూడా ఈ రోజునే. ఈ ఏడాది వాసవి జయంతి కూడా శనివారం నాడు వచ్చింది కాబట్టి ఈ రోజు అమ్మవారిని పూజిస్తే మరింత విశేషమైన అనుగ్రహం లభించడం ఖాయం. ఈ సందర్భంగా మద్యాహ్నం అన్నదానం నిర్వహించారు.చౌడేపల్లి పరిసర ప్రాంతాల నుండి భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల

**- సర్వదర్శనానికి 30 గంటల సమయం**
**-3 కిలోమీటర్ల పైన వేచి ఉన్న భక్తులు**



**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీనివాసుని దర్శనార్థం భక్తులు భారీగా తిరుమలకు చేరుకున్నారు. దీంతో తిరుమలగిరిలు భక్తులతో నిండిపోయాయి, వేసవి సెలవులు కావడం రాష్ట్రంలో ఎన్నికల ముగియడంతో సాధారణ ప్రజలు, ఉద్యోగస్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల చేరుకోవడంతో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. టోకన్లులేని సర్వదర్శనానికి వచ్చే భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు మొత్తం, నారాయణగిరి షెడ్డులు భక్తులతో నిండిపోయాయి. బయట మూడు కిలోమీటర్ల మేర భక్తులు క్యూ లైన్‌లలో స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారు తాగునీరు, అన్న ప్రసాదం, పాలు తదితర సౌకర్యాలను ఎప్పటికప్పుడు భక్తులకు అందిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి భద్రతాధికారులు ఎప్పటికప్పుడు క్యూ లైన్లు ను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ రద్దీ మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే పరిస్థితి ఉంది.



# సింహ వాహనంపై అనంత తేజోమూర్తి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్ :** గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఉదయం అనంతతేజోమూర్తి గోవిందరాజు స్వామి సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ వైభవంగా జరిగింది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. మృగాల్లో రారాజు సింహం. గాంభీర్యానికి చిహ్నం సింహం. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, శీఘ్రగమన శక్తికి ఆదర్శంగా భావిస్తారు. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తాడు. స్వామివారు రాక్షసుల మనసులలో సింహంలా గోచరిస్తాడని స్తోత్ర వ్మాయం కీర్తిస్తోంది. అనంతరం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజ స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు.సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆగమ సలహాదారులు సీతా రామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.





# జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజును నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఎన్నికల తర్వాత జరిగిన సంఘటనలపై ఎన్నికల సంఘం జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం బీహార్ ఎన్నికల అబ్జర్వర్ గా ఉన్న హర్షవర్ధన్ రాజును నియమించింది. గతంలో విజయవాడ డిసిపిగా, అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేశారు. అనంతరం సిఐడి ఎస్పీగా పనిచేశారు.

కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ ఎన్నికల అబ్జర్వర్‌గా ప్రస్తుతం హర్షవర్ధన్ రాజు విధుల్లో ఉన్నారు. సమర్థవంతమైన ఎస్పీగా కేంద్ర ఎన్నికల సంఘం హర్షవర్ధన్ రాజును గుర్తించి తిరుపతి జిల్లా ఎస్పీగా నియమించింది.

# వైభవంగా శనీశ్వరునికి అభిషేకం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:**

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో శనేశ్వర స్వామికి శనివారం సందర్భంగా విశేషమైన అభిషేకాలు నిర్వహించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్ర మంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు. అధికారులు. వేద పండితులు. భక్తులు పాల్గొన్నారు.



# నడివీధి గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

**- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీలలో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరలో అవాంచిత సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం చిత్తూరు నగరంలోని స్థానిక బజారు వీధిలో జరుగనున్న నడివీధి గంగమ్మ జాతరకు సంబంధించిన ప్రాంతాలను జిల్లా ఎస్పీ గంగమ్మ ఆలయ ధర్మకర్త సతీమణి సి.కె.లావణ్య, చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్పీ రాజగోపాల్ రెడ్డితో కలిసి చర్చి వీధి, బజార్ వీధి, శివాలయం వీధి, అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న ప్రాంతాలన్నీ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏటా చిత్తూరు పట్టణములో గంగమ్మ జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా జాతరకు తగిన పోలీస్ సిబ్బందితో పాటు, అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణలో బాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తామని తెలిపారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

జాతర సందర్భంగా మ్యాక్స్ షోరూం వద్ద నిర్వహిస్తున్న డీజే కార్యక్రమాలు "మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్" అమలులో ఉన్నందున శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని డీజే కార్యక్రమాలకు ఎటువంటి అనుమతి లేదని తెలియజేశారు. 144సెక్షన్ అమలులో ఉన్న ందున జాతర సమయంలో ఎటువంటి చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుం డా జాతర సజావుగా జరిగేల సహకరించాలని లేని పక్షంలో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చిత్తూరు సబ్-డివిజన్ ఆఫీస్ నందు పట్టణ అధికారులతో సమావేశమై జాతరను ప్రాశాంత వాతావరణంలో జరిపించడానికి తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్పీ పవన్ కుమార్, 1వ పట్టణ ఇన్స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, 2వ పట్టణ ఇన్స్పెక్టర్ ఉలసయ్య, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు, జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
ఇన్‌చార్జ్‌లు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో జర్నలిజంలో ఆసక్తి కలవారు తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలకు ఇంచార్జులు కావలెను.
మరిన్ని వివరాల కొరకు కింద కనబరచిన వారిని సంప్రదించగలరు.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

ఎన్.లక్ష్మినారాయణ రీజనల్ మేనేజర్, ఫోన్ నెం... 63011 07116, కె. సురేష్ బాబు బ్రాంచ్ మేనేజర్, ఫోన్ నెం... 93463 18232

## వైభవంగా వాసవి జయంతి

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** శాంతిపురం మండలం రాళ్ళబుదుగూరులో కొలువై ఉన్నటువంటి శ్రీ కన్యకా పరమేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ కన్యక పరమేశ్వరి జయంతి సందర్భంగా విశేషాలంకరణతో పూజారి కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ఆర్య వైశ్యు కుటుంబీకుల చే వాసవి జయంతి ఉత్సవాలను నిర్వాహింపజేశారు. అమ్మవారిని ప్రత్యేక చందన పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు అభిశేఖాలు చేశారు. అశేషంగా విచ్చేసిన బక్కాదులకు తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు భక్తాదులు పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోటలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండల పరిధిలోని లక్ష్మమ్మ గిరిజన కాలనీలో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. కోట జూనియర్ సివిల్ జడ్జ్ భరత్ కమల్ మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి వివాదాలు లేకుండా సామరస్యంగా పౌరులందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. పాత కేసులు ఏమైనా ఉంటే వాటిని వచ్చే లోక్ అదాలత్ లో కేసులు రాజీ చేసుకోవాలన్నారు. విద్య చాలా అవసరమని విద్య లేకపోతే దేనికి పనికిరారని అందరూ చదువుకొని ఉన్నతమైన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట రమణమ్మ,జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్, కోట ఎస్సై నాగబాబు, అడ్వకేట్ అశోక్ కాంబ్లే ,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 2024 ఎన్నికల్లో గెలుపు టీడీపీ కూటమిదే

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** 2024 ఎన్నికల్లో గెలుపు ఆంధ్రప్రదేశ్ ప్రజల వైపు ఉన్న తెలుగుదేశం పార్టీ కూటమిదే అని ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోపీనాథ్ పేర్కొన్నారు. పుత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఐదేళ్లుగా తాము అనుభవించిన కష్టాలు, కన్నీళ్లకు ఓట్ల రూపంలో బదులు తీర్చుకున్నారని పేర్కొన్నారు.



వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలు, బస్సు ఛార్జీలు పెంచి ప్రజలను మోసం చేసిందని తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. నగరి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయం సాధించబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ సభ్యులు సింగరాజు సంతోష్, చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, యుగంధర్ వర్మ, దేవినేని హరీష్, ఎస్.మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌లో ప్రజలకు తప్పని తిప్పలు

**మౌలిక సదుపాయాలు కల్పించండి : బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రజల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ నిధులతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సర్వాంగ సుందరంగా తయారుచేసిన వినాయక సాగర్ లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, వెంటనే అధికారులు చొరవ తీసుకుని వినాయక సాగర్లో మౌలిక వసతులు కల్పించాలని బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో సాగర్‌లో ప్రజలకు తప్పని తిప్పలు మారాయని, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాధనం "బూడిదలో పోసిన పన్నీరు" లా మారిందన్నారు. వినాయక సాగర్ లో ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ చేసే పెద్దలు, యువకులు ముఖ్యంగా మహిళలతో పాటు ఆటలు ఆడుకునే పసిపిల్లల సౌకర్యార్థం కనీసం త్రాగేందుకు "మంచినీటి సౌకర్యం" లేకపోవడం,"మరుగుదొడ్ల నిర్మాణం" చేపట్టకపోవడంతో ఆహ్లాదకరమైన పార్క్ వాతావరణం అపరిశుభ్రంగా తయారవుతున్నదన్నారు. అలాగే లక్షలు పెట్టి ఏర్పాటుచేసిన పరికరాలు మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అధికారులు టెండర్లు పిలవడంలో చూపించే శ్రద్ధ వినాయక సాగర్ లో మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు. అక్కడికి వచ్చే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసం దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. వినాయక సాగర్ కు స్మార్ట్ సిటీ నగరపాలక సంస్థ నిధులు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో దానిపై "శ్వేత పత్రం" విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీవారి సేవలో బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కాకినాడ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ తెలంగాణ చేవెళ్లే ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మహారాష్ట్ర మంత్రి అనిల్ పటేల్‌లు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

# వైభవంగా సదాశివేశ్వర స్వామి కల్యాణోత్సవం

**కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆర్.కె.రోజా**

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** మంత్రి ఆర్.కె.రోజా పుత్తూరు పట్టణంలో వెలసిన కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో శనివారం సాయంత్రం పాల్గొన్నారు. కామాక్షి సమేత సధాశివేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కళ్యాణోత్సవ మహోత్సవానికి విచ్చేసిన మంత్రి రోజాకి ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్ బాబు ధర్మకర్తల మండలి వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఆర్. కె. రోజా స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి రోజాని ఆలయంలో వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించి పూజారులు ఆశీర్వదించారు. అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెను ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందించారు. శివుని ఆశీస్సులతో జగనన్న రెండో సారి ముఖ్యమంత్రిగా తను మూడోసారి ఎంఎల్ఏగా హ్యాట్రిక్ కొట్టాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ మెంబర్లు, ప్రజాప్రతినిధులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## ఉచిత ఖత్నాను సద్వినియోగం చేసుకోండి

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:**

ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమం గూడూరు పట్టణంలోని షాదీ మందిర్‌లో నిర్వహిస్తున్నట్లు ఇన్సాఫ్ కమిటీ సభ్యుడు కాలేషా తెలిపారు. శనివారం గూడూరు పట్టణంలోని షాదీ మందిర్‌లో ఇన్సాఫ్ కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇన్సాఫ్ కమిటీ సభ్యులు కాలేశా మాట్లాడుతూ ముస్లింలకు ఖత్నా కార్యక్రమం చాలా ముఖ్యమైందని అయితే ముస్లింలలో పేదవారు ఈ కార్యక్రమం చేసుకునేందుకు పలు ఇబ్బందులు పడుతు న్నట్లు మా దృష్టికి రావడంతో గత కొద్ది సంవత్సరాలుగా ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ఖాత్న కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన వైద్యుల పర్యవేక్షణలో పట్టణంలోని షాదీ మందిర్‌లో ఉచిత కత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని ముస్లిం సోదరులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అన్వర్ భాష, శంషాద్దీన్ ,ఇబ్రహీం, నయుం, అల్తాఫ్ రఫీ, మహుబలి నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చేనేత హస్తకళ మేళ ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో కరకంబాడి రోడ్డులోని అక్కారం పల్లి వద్ద ఉన్న విఆర్ఆర్ కళ్యాణ మండపంలో శనివారం చేనేత హస్తకళల మేళ ను ఘనంగా ప్రారంభించినట్లు సంస్కృతి కల్చరల్ క్రాఫ్ట్ సొసైటీ సెక్రటరీ పైడి మహేష్ తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో భారతీయ సంపదైన చేనేత, హస్తకళా రూపాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో సంస్కృతి కల్చరల్ క్రాఫ్ట్ సొసైటీ వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవడంతో పాటు కళాకారులను మరింత ప్రోత్సహిస్తూ అమ్మకం ఏర్పాటు చేశారన్నారు. చేనేత, హస్తకళలను ప్రజలకు అందించడంతో పాటు తద్వారా కళాకారులకు ఉపాధి కల్పించడం. జరుగుతోందన్నారు. ఈ చేనేత, హస్తకళా ప్రదర్శన నేటి నుంచి 15 రోజులు పాటు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ హస్తకళారూపాలు, చేనేత వస్త్రాలతో పాటు దేశంలోని వివిధ నాగరికతలకు సంబంధించిన వస్తువులతో సుమారు 35 స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శనతో పాటు విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ చేనేత హస్తకళల ప్రదర్శనలో జైపూర్ కి చెందిన బెడ్ షీట్స్, గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, బెంగాలీ కాటన్ సారీస్, కాంత వర్క్ సారీస్, భాగల్పూర్ డ్రెస్ మెటీరియల్స్ అండ్ చీరలు, మన రాష్ట్రానికి చెందిన కొండపల్లి బొమ్మలు, కడపకి చెందిన చేనేత టవల్స్, కాది షర్ట్స్ ఖాదీ టాప్, హైదరాబాద్ కి చెందిన వ్యోండ్ బ్లాక్ ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# ముద్దిగుప్పంలో స్టార్టర్ చోరీ

**సర్పంచ్ ఎంపీటీసీ సెక్రెటరీ కలసి పోలీసులకు ఫిర్యాదు**

**ఎస్ఆర్‌పురం మేజర్‌న్యూస్:** రక్షిత మంచి నీటి సరఫరా స్కీం ద్వారా ఏర్పాటుచేసిన బోర్ మోటర్ స్టార్టర్ చోరీకి గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎస్ఆర్ పురం మండలంలోని ముద్దికుప్పం గ్రామపంచాయతీ దిగువ ముద్దికుప్పం గ్రామంలో ప్రభుత్వ నిధులతో రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా గ్రామ ప్రజలకు త్రాగునీరు కోసం ఏర్పాటుచేసిన బోరు మోటారు స్టార్టర్ ను శుక్రవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ క్రమంలో వరుసుగా దోపిడీ జరుగుతున్నాయని గతంలో కూడా చొక్కామడుగు గ్రామంలో స్టాటర్ చోరీకి గురి అయినట్లు గ్రామస్తులు స్థానిక సర్పంచ్ గిరిబాబు సీనయ్య ఎంపీటీసీ సిద్దయ్యతో కలిసి గ్రామపంచాయతీ సెక్రెటరీ కోదండరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ స్టాటర్ సుమారు పదివేల ఐదు వందలు రూపాయలు విలువ చేస్తుందన్నారు. గ్రామ స్తులతో కలిసి సెక్రటరీ కోదండ రామిరెడ్డి ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్ ఎస్సై రాజా కుల్లయ్యప్పకు ఫిర్యాదు చేశారు. ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమం స్థానిక సర్పంచ్ గిరిబాబు, శీనయ్య, ఎంపీటీసీ సిద్దయ్య పంచాయతీ సెక్రెటరీ కోదండ రామిరెడ్డి నాయకులు వాసు గ్రామస్తులు పాల్గొన్నారు.

